విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు దిక్సూచి 'మానేరు'

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

హగ్స్ అండ్ హార్ట్స్ ఇంటర్నేషనల్ స్కూల్ ను ప్రారంభిస్తున్న బండి సంజయ్ కుమార్

కమాన్‌చౌరస్తా/విద్యానగర్, జూన్ 7: ప్రస్తుత కాలంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు కరీంనగర్‌లోని మానేరు విద్యా సంస్థలు దిక్సూచిగా నిలుస్తున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ మానేరు విద్యా సంస్థల ఆధ్వర్యంలో తీగలగుట్టపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన మానేరు హగ్స్ అండ్ హార్ట్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ, ఉన్నత విలువలు, అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యా బోధన మానేరు విద్యాసంస్థల్లో జరుగుతున్నదని కొనియాడారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్య నందించడమే లక్ష్యంగా ప్రపంచ స్థాయిలో విద్యాబోధనను అందించే విధంగా హగ్స్ అండ్ హార్ట్స్ స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ రమేశ్, మాజీ కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, కాశెట్టి లావణ్య శ్రీనివాస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దళితుల ఓట్ల విభజనపై చర్యలు తీసుకోవాలి

కార్పొరేషన్, జూన్ 7: కరీంనగర్ నగరపాలక సంస్థలో ఇటీవల ప్రకటించిన ముసాయిదాలో నగరంలోని పలు ప్రాంతాల్లో సముహంగా ఉన్న దళిత ఓటర్లను విభజించి డివిజన్లు ఏర్పాటు చేశారని, వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. నగరంలో అనేక తరాలుగా అంబేద్కర్‌నగర్, కార్ఖానాగడ్డ, బుట్టిరాజారాంకాలనీ, కిసాన్‌నగర్, సవరాన్ స్ట్రీట్, దుర్గమ్మగడ్డ, శర్మనగర్ తదితర ప్రాంతాల్లో దళితులంతా ఒక ప్రాంతంగా నివాసిస్తున్నారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా దళితుల సముహాన్ని విభజించకుండానే డివిజన్లను ఏర్పాటు చేసిందని, కానీ ఇప్పుడు అధికారులు అత్యుత్సాహంతో మెజారిటీ దళిత వాడలను రెండు, మూడుగా విభజించారని పేర్కొన్నారు. గతంలో డివిజన్‌లో 1500లకు పైగా దళిత ఓటర్లు ఉంటే ఇప్పుడు కేవలం 300 ఓటర్లు ఉండేలా డివిజన్లను విభజించారని తెలిపారు. ఇష్టారాజ్యంగా దళితులను విభజించడం వల్ల దళితులకు రిజర్వేషన్లు అందకుండా పోతాయన్నారు. దీనిపై వెంటనే డిప్యూటీ సీఎం చర్యలు చేపట్టాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

తిమ్మాపూర్, జూన్ 7: అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తిమ్మాపూర్ మండలంలోని లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వం చెప్పిన విధంగానే నిర్మించుకోవాలని చెప్పారు. మంజూరైన వారు తప్పకుండా నిర్మించుకోవాలని సూచించారు. హౌసింగ్ పీడీ గంగాధర్ లబ్ధిదారులకు విధివిధానాలు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బండారి రమేశ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్ రావు, ఎస్ఎల్ గౌడ్, కొత్త తిరుపతిరెడ్డి, మాచర్ల అంజయ్య, దావు సంపత్ రెడ్డి, పోలు రమేశ్, రాము, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇండ్లు రాలేదని పలువురి అసంతృప్తి

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపు కోసం కష్టపడ్డ అర్హులైన తమకు ఇండ్లు రాలేదని పలువురు కార్యకర్తలు, వివిధ గ్రామాలకు చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల ముఖ్య నాయకులతో గొడవకు దిగారు. గ్రామాల్లో ఆర్థికంగా ఉన్నవారికే ఇండ్లు ఇచ్చారని, అర్హులైన తమకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మరో విడుతలో ఇల్లు వస్తుందని నాయకులు వారికి నచ్చజెప్పారు.

డీ సెట్ ఫలితాలు విడుదల

తిమ్మాపూర్, జూన్ 7: డిప్లామా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రెండేళ్ల కోర్సులో చేరేందుకు నిర్వహించిన డీసెట్ ఫలితాలు విడుదలైనట్లు డైట్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న అర్హత సాధించిన అభ్యర్థులకు ఎల్ఎండీలోని డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, అన్ని విద్యార్హత పత్రాలు, ఆదాయ కుల సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు డీ సెట్ వెబ్సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

పేద విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలి

తెలంగాణచౌక్, జూన్ 7: ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయించాలని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీమా సాహెబ్ కోరారు. నగరంలోని గిరిజన సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యాహక్కు చట్టం ప్రకారం అన్ని కార్పొరేట్ సంస్థలు పేదలకు సీట్లు కేటాయించాల్సి ఉండగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ రూపంలో ఎన్నో ప్రయోజనాలు పొందుతున్న విద్యా సంస్థలు తప్పనిసరిగా పేదలకు సీట్లు కేటాయించాలన్నారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మీ మెదడు చెప్పే మాట వినండి

- సాధారణ లక్షణాలే తీవ్ర సమస్యకు సంకేతాలు కావొచ్చు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే

విద్యానగర్, జూన్ 7: నిత్యం మనం తలనొప్పిని పని ఒత్తిడిగా, మతిమరుపును వయసు ప్రభావంగా, కళ్లు తిరగడాన్ని అలసటగా తేలికగా తీసుకుంటాం. కానీ, ఒక్కోసారి ఈ సాధారణ లక్షణాలే మన మెదడులోని ఒక తీవ్ర సమస్యకు సంకేతాలు కావొచ్చు.. మీ మెదడు మౌనంగా సహాయం కోరుతూ ఉండొచ్చు. ఒక చిన్న స్కాన్, ఒక సరైన వైద్య నిర్ణయం నిండు జీవితాన్ని, ఒక కుటుంబ భవిష్యత్తును పూర్తిగా మార్చగలదు. నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా వ్యాధి లక్షణాలు, చికిత్స విధానాలపై కథనం..

బ్రెయిన్ ట్యూమర్‌పై ప్రజల్లో అవగాహన పెంచే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం జూన్ 8న, ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డేగా జరుపుతున్నారు. బ్రెయిన్ ట్యూమర్లు అరుదైనవి కావు. ఇవి పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరికైనా రావొచ్చు. ముఖ్యంగా, ప్రారంభ లక్షణాలు తరచూ ఇతర సాధారణ ఆరోగ్య సమస్యలుగా కనిపించి, తర్వాత క్లిష్టమైన పరిస్థితులకు దారితీస్తాయి. సరైన సమయంలో గుర్తించి చికిత్స పొందితే ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, జీవన నాణ్యతను కూడా మెరుగుపరచుకోవచ్చు.

ఇవి లక్షణాలు:

ఉదయం పూట తరచూ వచ్చే తీవ్రమైన తలనొప్పి, వ్యక్తిత్వంలో అకస్మాత్తుగా మార్పులు, చూపు మసకబారడం, మాట తడబడడం, మతిమరుపు లేదా గతంలో ఎప్పుడూ లేని ఫిట్స్ (మూర్ఛలు) వంటి లక్షణాలను గమనిస్తే, వీటిని అస్సలు నిర్లక్ష్యం చేయవద్దు. ఇవి బ్రెయిన్ ట్యూమర్ సంకేతాలు కావొచ్చు. వీలైనంత త్వరగా డాక్టర్‌ను సంప్రదించి, అవసరమైన స్కానింగ్‌లు చేయించుకోవడం చాలా ముఖ్యం.

వేగంగా కోలుకునేలా చికిత్స

మెడికవర్ న్యూరో సైన్సెస్ వద్ద, మేము బ్రెయిన్ ట్యూమర్‌ను కేవలం ఒక వ్యాధిగా కాకుండా, రోగికి కొత్త జీవితాన్ని ప్రసాదించే అవకాశంగా చూస్తాం. నిపుణులైన వైద్యులు అధునాతన ఎంఆర్ఐ, న్యూరో-నావిగేషన్ సిస్టమ్స్, మినిమల్ ఇన్వాసివ్ సర్జరీ, రోబోటిక్ సర్జరీ వంటి అత్యాధునిక పద్ధతులను ఉపయోగించి, రోగులకు వేగంగా కోలుకునేలా చికిత్స అందిస్తున్నాం. మా బహుళ-విభాగాల సంరక్షణ (మల్టీ డిసిప్లినరీ కేర్) కేవలం శరీరానికి మాత్రమే కాకుండా, రోగి మానసిక స్థితికి కూడా మద్దతునిస్తుంది.

- డాక్టర్ ముక్కు రాజీవ్ రెడ్డి, కన్సల్టెంట్ న్యూరో సర్జన్

ఓపెన్ జిమ్.. నిర్వహణ నిల్

నగరంలో ఓపెన్ జిమ్ బేస్‌మెంట్ షీట్స్ పైకి లేవడంతో అవస్థలు పడుతున్న నగరవాసులు

- పనికి రాకుండా పోతున్న పరికరాలు
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

నగర వాసుల ఫిట్‌నెస్ కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల పరికరాలు వ్యాయామానికి పనికిరాకుండా పోతున్నాయి. ప్రారంభించిన కొత్తలో వాటిని సజావుగా నిర్వహించిన నగరపాలక సంస్థ, ఆ తర్వాత గాలికి వదిలేయడంతో దాదాపు అత్యధిక ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తపల్లి, జూన్ 7: స్మార్ట్‌సిటీలో భాగంగా నగరవాసుల ఆరోగ్యం కోసం పలు ప్రాంతాల్లో రూ.లక్షలు వెచ్చించి ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని డా.బీఆర్ అంబేద్కర్ స్టేడియం ప్రధాన గేటు నుంచి స్టేడియం లోపలికి వచ్చే మార్గంలో ఒకటి, స్విమ్మింగ్ పూల్ సమీపంలో మరొకటి అందుబాటులోకి తీసుకువచ్చారు. సుమారు రూ.15 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ సమీపంలోని ఓపెన్ జిమ్ నిర్వహణ సరిగా లేక పరికరాలు కొన్ని చెడిపోయి పనికిరాకుండా పోయాయి. వీటిలో కొన్ని పరికరాలు విరిగిపోగి, మరికొన్ని పనిచేయడం లేదు. ఓపెన్ జిమ్‌కు బేస్‌మెంట్‌గా వేసిన ప్రత్యేకమైన షీట్‌లు ఎండకు ఎండి, వానకు తడిచి వికృతంగా తయారయ్యాయి. వీటిపై నిలబడి జిమ్ చేయాలంటే నగరవాసులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తున్నది. నగరంలో వాకింగ్, వ్యాయామం చేసేందుకు ప్రతిరోజూ వేల సంఖ్యలో అంబేద్కర్ స్టేడియానికి వస్తుంటారు. వీరిలో చాలా మంది ఓపెన్ జిమ్ చేయడానికి ఆసక్తి కనబరుస్తుండగా చెడిపోయిన పరికరాలు, ఇతరత్రా కారణాలతో వృథాగా మారుతున్నాయి. నగరపాలక సంస్థ మంచి ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు నిర్వహణ లేక మూలకు పడే దశకు చేరుకున్నాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ, జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారులు సమన్వయంతో వీటిని మరమ్మతులు చేయించాలని పలువురు కోరుకుంటున్నారు.

జిమ్ చేద్దామంటే సాధ్యం కావడం లేదు

నగరంలోని అంబేద్కర్ స్టేడియంకు ప్రతిరోజు వాకింగ్ చేయడానికి వస్తుంట. వాకింగ్ ముగిసిన అనంతరం ఓపెన్ జిమ్ చేస్తుంట. జిమ్ పరికరాలు గతంలోలాగా పనిచేయడం లేదు. స్విమ్మింగ్ పూల్ సమీపంలోని ఓపెన్ జిమ్‌లో నిలబడేందుకు ఇబ్బందిగా ఉంది. జిమ్ పరికరాలకు సపోర్ట్‌గా వేసిన షీట్స్ పైకి లేచి ఇబ్బందిగా మారాయి. వాటిని రెగ్యులర్‌గా మెయింటనెన్స్ చేస్తే నగరవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

- గోనేల కుమారస్వామి, వాకర్, అంబేద్కర్ స్టేడియం

టెస్కో జీఎంకు సన్మానం

గంగాధర, జూన్ 7: చేనేత జౌళీశాఖ టెస్కో జీఎం అశోక్‌రావును మండలంలోని గర్శకుర్తి చేనేత పవర్‌లూమ్స్ వస్త్రోత్పత్తి వ్యాపారులు శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. చేనేత జౌళీ శాఖలో సుదీర్ఘ కాలం పని చేసి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అశోక్‌కుమార్‌కు నేతన్నలు తయారు చేసిన ప్రత్యేక రాట్నాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అలువాల విఠోబా, అన్నల్‌దాస్ శ్రీనివాస్, చిందం సత్యనారాయణ, చిందం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జమ్మికుంట, జూన్ 7: ఈ నెల 14న హుజూరాబాద్ కోర్టులో మెగాలోక్ అదాలత్ జరుగనుందని, లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ సీఐ ఎస్ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు పెట్టుకున్న కేసుల్లో ఇరు పక్షాల అంగీకారంతో రాజీ పడవచ్చని, కేసులను తొలగించుకోవచ్చని తెలిపారు. చిన్న కేసులతో జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జూన్ 7: నగరంలో డీటీఆర్, విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 8నుంచి 10గంటల వరకు ముకరంపుర, బస్ స్టాండ్, వన్ టౌన్ పోలీసు స్టేషన్, కలెక్టరేట్ కార్యాలయం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కరీంనగర్ డెయిరీకి వెటర్నరీ అంబులెన్స్ వితరణ

కరీంనగర్ డెయిరీకి అంబులెన్స్‌ను అందిస్తున్న కృష్ణ కర్వా

కరీంనగర్, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : పాడి రైతులకు కొండంత అండగా ఉన్న కరీంనగర్ డెయిరీకి ప్రముఖ పారిశ్రామిక వేత్త కేసరిమల్ కర్వా జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు శనివారం వెటర్నరీ అంబులెన్స్‌ను ఉచితంగా అందించారు. కరీంనగర్‌లోని శ్రీవెంకటేశ్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్తలు భగవాన్ కర్వా, వేణుగోపాల్ కర్వా, తమ తండ్రి అయిన కేసరిమల్ కర్వా జ్ఞాపకార్థం జిల్లాలోని పాడి పశువులకు వైద్య సేవలందించే ఉద్దేశంతో అంబులెన్స్‌ను వితరణ చేశారు. కరీంనగర్ డెయిరీ ప్రాంగణంలో పూజలు నిర్వహించిన అనంతరం డెయిరీ చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్ రావుకు వెటర్నరీ అంబులెన్స్ అందించారు. కేసరిమల్ కర్వా మనుమడు కృష్ణ కర్వా పచ్చజెండా ఊపి అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డెయిరీ చైర్మన్ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ, పాడి పరిశ్రమ అభివృద్ధికి కేసరిమల్ కర్వా ఎంతో మద్దతు ఇచ్చారని, ఆయన ఇంట్లోనే పాల ఉత్పత్తుల అమ్మకాలు చేపట్టామని పేర్కొన్నారు. కరీంనగర్ డెయిరీ వైద్యులు, పారామెడికల్ సిబ్బందితో కూడిన ఒక వైద్య బృందాన్ని ఈ అంబులెన్స్‌కు కేటాయిస్తామని వెల్లడించారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా రైతుల ఇండ్లకు వెళ్లి పాడి పశువులకు సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ ఎండీ పీ శంకర్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ టీ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఔదార్యం

మమతకు బట్టలతో పాటు బంగారు ఉంగరాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ సతీమణి దీవెన

చొప్పదండి, జూన్ 7: మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన అనాథ యువతి మమత పెండ్లి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కానుకలు పంపించి ఔదార్యాన్ని చాటుకున్నారు. తన సతీమణి దీవెన ద్వారా చీరెతో పాటు బంగారు ఉంగరం అందజేశారు. కాట్నపల్లి గ్రామానికి చెందిన సమత, మమతల తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందగా అనాథలయ్యారు. ఆ సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న సుంకె రవిశంకర్ వారికి ఆర్థిక సాయం అందించడంతోపాటు మమతకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేశారు. ప్రతి దసరాకు సమత, మమతను ఇంటికి ఆహ్వానించి, కొత్త బట్టలు పెట్టి వారి ఆలనపాలన చూసుకుంటూ వస్తున్నారు. మమత పెండ్లి ఆదివారం నిశ్చయించగా, మాజీ ఎమ్మెల్యే సతీమణి దీవెన శనివారం మమతను పెండ్లి కూతురిని చేసి చీరెతో పాటు బంగారు ఉంగరం కానుకగా అందించారు. సమత, మమతకు అండగా ఉంటున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలి

కలెక్టరేట్, జూన్ 7 : మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొద్ది రోజులుగా ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలని, తెలంగాణ అభ్యుదయ వాదుల వేదిక జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శనివారం నగరంలోని కిసాన్‌నగర్‌లో గల ఆసంఘం జిల్లాశాఖ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా ద్వైవార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసంఘం రాష్ట్ర ప్రతినిధులు మల్యాల రామ్మోహన్, వెంకట రాజమల్లు మాట్లాడుతూ, కాల్పుల విరమణ పాటిస్తూ, కేంద్ర ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమేనని ప్రకటించినా, వేల మంది కేంద్ర బలగాలతో ప్రభుత్వం కర్రెగుట్టల్లో కూంబింగ్ చేస్తూ ఎన్‌కౌంటర్‌లకు పాల్పడుతుండడం మానవత్వాన్ని మంటగలపడమేనని మండిపడ్డారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి, మావోయిస్టులతో చర్చలు జరిపి అటవీ ప్రాంతాల్లో ప్రశాంతత నెలకొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని వేదిక బాధ్యులు రజాక్, దుబాసి శ్రీను, ఎల్కపల్లి మల్లేశం, ఆర్.వెంకటేశం, ఎం.నారాయణ, వి.భాస్కర్, కె.వీరయ్య, సిహెచ్.రామారావు, చిలువేరి నవీన్, చేతన, చైతన్య, రఫీక్, రాజుతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, జూన్ 7 : తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా 2024-25 సంవత్సరానికి జిల్లాలోని దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేసేందుకు మహిళాశిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల జిల్లా శాఖ దరఖాస్తులు కోరుతున్నట్లు, జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి తెలిపారు. రెట్రోఫిటెడ్ మోటారైజ్డ్ వాహనాలు, బ్యాటరీ వీల్‌చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ సైకిళ్లు, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికిల్స్, హైబ్రీడ్ వీల్ చైర్ అటాచ్‌మెంట్ వీల్ చైర్, లాప్‌టాప్‌లు, టాబ్స్, ఫోల్డబుల్ ఫోన్లు, ట్రైసైకిళ్లు, కాలిపేర్స్, ఆర్టిఫీషియల్ లింబ్స్, క్రచెస్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్‌కేన్స్, బ్రెయిలీ బుక్స్, కిట్స్, టీచింగ్ లర్నింగ్ మెటీరియల్, ఎంఆర్‌సీ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అవసరమైన దివ్యాంగులు http://obmms.cgg. gov.in// వెబ్‌సైట్‌లో అవసరమైన ధ్రువీకరణ పత్రాలు జతచేసి ఈనెల 18లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా కమిటీ ఎంపిక చేసిన వారికి ఉపకరణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. పూర్తి వివరాల కోసం 9494317315 నంబర్‌లో సంప్రదించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు.

అదుపుతప్పి రొటోవేటర్‌లో పడిన రైతు

కరీంనగర్ రూరల్, జూన్ 7: నారుమడి కోసం పొలం దున్నుతున్న ఓ రైతు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ రొటోవేటర్‌లో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్ గ్రామానికి చెందిన చిట్కూరి అజయ్‌కుమార్(20) శనివారం ఇరుకుల్ల శివారులోని నారుమడి కోసం ట్రాక్టర్ రొటోవేటర్‌తో పొలం దున్నుతున్నాడు. పొలం దున్నే క్రమంలో ట్రాక్టర్‌కు అడ్డుగా ఉన్న డ్రిప్ పైపులను కాలుతో తప్పించే క్రమంలో అదుపుతప్పి రొటోవేటర్‌లో పడిపోయాడు, వెంటనే అప్రమత్తమైన స్థానిక రైతులు రొటోవేటర్‌ను ఆపి, అందులో ఇరుకున్న అజయ్‌కుమార్‌ను దాదాపు గంటపాటు శ్రమించి బయటకు తీశారు. తీవ్ర గాయాలపాలైన అతడిని చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. ఈ ప్రమాదంలో ఎడమకాలు మోకాలు వరకు తెగిపోగా, కుడికాలు, చేయి, విరిగిపోయిందని, వైద్యులు చికిత్స చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దేవేందర్ రెడ్డి

తిమ్మాపూర్, జూన్ 7: మండల కేంద్రానికి చెందిన బోర్ర శంకర్ అనారోగ్యంతో శనివారం అకాల మరణం చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పేద కుటుంబం కావడంతో చలించి దహన సంస్కారాల కోసం రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఆయన తోపాటు నాయకులు వేల్పుల మల్లయ్య, మాతంగి అంజయ్య, బోర్ర రవి, బోర్ర శ్రీనివాస్, గాజ సాగర్, తదితరులు ఉన్నారు.

పోరాటాలతో బీసీలు హక్కులు సాధించుకోవాలి

తెలంగాణచౌక్, జూన్ 7: బీసీలు పోరాటాలతోనే తమ హక్కులను సాధించుకోవాలని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింగ్‌రావు పేర్కొన్నారు. నగరంలోని పద్మశాలీ సంక్షేమ ట్రస్ట్ భవనంలో శనివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీసీలను చైతన్య పరిచి హక్కుల సాధన లక్ష్యంగా మన ఆలోచన సాధన సమితి ముందుకు వెళ్తుందన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా అందరినీ కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమితి విస్తరణ కోసం అన్ని జిల్లాల్లో కమిటీలను నియమించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వివిధ కుల సంఘల నాయకులు పాల్గొన్నారు.

'కన్నీటి గాథ' లఘు చిత్రం ప్రారంభం

కమాన్‌చౌరస్తా, జూన్ 7 : రెడీ మేడ్ షో రూంలు రావడం, బంగారం ధర పెరుగడం, పెట్టుబడి లేకపోవడంతో చేతి వృత్తిపై ఆధారపడిన స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇతివృత్తంగా రూపొందిస్తున్న 'కన్నీటి గాథ' సందేశాత్మక లఘు చిత్రాన్ని మహాశక్తి దేవాలయంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సందేశాత్మక చిత్రాన్ని రూపొందిస్తున్న దర్శకుడు అనసూరి భూనాథాచారి, నిర్మాత కట్ట సత్యనారాయణాచారి, నటీ నటులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీరామోజు అశోక్, బొద్దుల ప్రవీణ్, గద్దె ఉదయ్ కుమార్, రంగు భాస్కరాచారి, సొల్లు అజయ్, తిప్పర్తి ప్రభు, బేబీ శ్రీకృతి, బేబీ మధుమిత, స్వర్ణకార సంఘాల నాయకులు మత్తోజు శ్రీనివాస్, కడార్ల శివప్రసాద్, రావుల శ్రీకాంత్, కందుకూరి శ్రీనివాస్, కడార్ల శ్రీనివాస్, వెగ్గలం రామకృష్ణ, ఎదులాపురం మహేశ్, ముత్తోజు మహేశ్ పాల్గొన్నారు.

నగరంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

భక్తి శ్రద్ధలతో బక్రీద్

నమస్తే నెట్‌వర్క్, జూన్ 7 : జిల్లా వ్యాప్తంగా శనివారం బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే ముస్లింలతో ప్రార్థన స్థలాలన్నీ కిటకిటలాడాయి. సామూహిక ప్రార్థనల అనంతరం మత గురువులు సందేశం ఇచ్చారు. కరీంనగర్‌లోని రేకుర్తి సాలెహ్ నగర్, చింతకుంట వద్ద ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్థనలో పాల్గొన్నారు. సాలెహ్‌నగర్ ఈద్గా వద్ద సదర్ ఖాజీ మన్నబత్ షా ఖాన్ నమాజ్ చేయించగా, మత పెద్ద ఈద్గా ఖతీబ్ ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

చొప్పదండి, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులతో నాణ్యమైన విద్యనందిస్తున్నామని, తల్